అంధకారంలో అమరవీరుల పార్కు

- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న సందర్శకులు


పార్కులో పనిచేయకుండా ఉన్న లైట్లు


చిమ్మ చీకటిగా ఉన్న అమరవీరుల పార్కు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని తెలంగాణ అమరవీరుల పార్కు కొద్దిరోజులుగా అంధకారంలో మగ్గుతోంది. లైట్లు వెలగకపోవటంతో పార్కుకు వచ్చే సందర్శకులు, ఆడుకునేందుకు వచ్చే పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్కు చుట్టూ ఉన్న వీధి లైట్ల మసక మసక వెలుతురులోనే వృద్ధులు సేదతీరుతున్నారు. నగరంలోని వినాయక్‌నగర్ న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో గల తెలంగాణ అమరవీరుల పార్కుకు ఉదయం, సాయంత్రం వేళలో వందలాది మంది సందర్శకులు వస్తుంటారు. పార్కులో కూర్చునేందుకు మాత్రమే సౌకర్యాలు ఉండగా, బాత్‌రూం, తాగేందుకు మంచినీటి వసతి ఏర్పాటు చేయలేదు. అయినా వీటి గురించి సందర్శకులు అడగడటం లేదు. కనీసం రాత్రివేళలో అయినా పార్కులో లైట్లు వెలిగేలా చూడాల్సిన సంబంధింత మున్సిపల్ అధికారి దీని గురించి ఏ మాత్రం పట్టించుకోకపోవటం గమనర్హం. పార్కు ఇన్‌చార్జి కరుణాకర్‌కు లైట్లు వెలగటం లేదని సందర్శకులు నెలరోజులుగా చెబుతున్నా ఆయన ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. పార్కులో కొద్దినెలల క్రితం వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేసిన సమయంలో లైటింగ్ వైర్లు తెగిపోయినా వీటి గురించి పట్టించుకోవటంలేదు. ప్రస్తుతం పార్కు మధ్యలో సెంట్రల్ లైట్ ఒకటి. అక్కడక్కడ కొన్ని లైట్లు వెలుగుతుండగా, సగం వాకింగ్ ట్రాక్‌పై లైట్లు వెలగటంలేదు. పార్కులో తక్షణమే లైట్లు అన్నీ వెలిగేలా చూడాలని సందర్శకులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



పార్కుకు నిత్యం వృద్ధులు సేదతీరేందుకు, పిల్లలు ఆడుకునేందుకు, మరికొందరూ వాకింగ్‌కు వస్తుంటారు. వాకింగ్ ట్రాక్‌పై కొంత భాగం లైట్లు వెలగటంలేదు. పార్కులో ఇటీవల కోతులు ఎక్కువగా సంచరిస్తున్నాయి. చీకటిలో ఎక్కడ తమపై పడతాయేమోనని భయంగా ఉంది. లైట్లకు త్వరగా మరమ్మతులు చేపట్టాలి. –చెన్నారెడ్డి, హౌసింగ్‌బోర్డుకాలనీ

వాకింగ్‌కు ఇబ్బందవుతోంది



నిత్యం సాయంత్రం వేళలో వాకింగ్‌కు వస్తాను. చీకటి పడగానే వాకింగ్ ట్రాక్‌పై చీకటి ఉంటోంది. లైట్లకు మరమ్మతులు చేయాలని ఇక్కడ పనిచేసే మున్సిపల్ సిబ్బందికి చెప్పినా వినిపించుకోవడం లేదు. పార్కులో కుక్కలు, కోతులు సంచరిస్తున్నాయి. వాటితో భయంగా ఉంది.
– తమ్మల శ్రీనివాస్, ఆర్యనగర్

ప్రజల జీవితాలతో ఆటలాడుతున్నారు


అలీసాగర్ ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


ఉద్యోగుల హాజరును పరిశీలిస్తూ..

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా
- అలీసాగర్, ఖిల్లా వాటర్ ఫిల్టర్ బెడ్ల పరిశీలన
- అధికారులపై తీవ్ర ఆగ్రహం

నిజామాబాద్‌నాగారం: నగర ప్రజలకు మంచి నీటి సరఫరా కోసం నిర్మించిన అలీసాగర్, ఖిల్లా వాటర్ ఫిల్టర్ ప్రాజెక్టులను శుక్రవారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫిల్టర్ అయిన నీటిలో నాచు, వేస్ట్ పదార్థాలు పేరుకుపోయి ఉండటంతో సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ మాట్లాడుతూ.. రాబోయే ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నగరంలోని పలు డివిజన్లలో నీటి సమస్య తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో వాటర్ ఫిల్టర్ బెడ్లను పరిశీలించడానికి వచ్చానని తెలిపారు. సగం యంత్రాలు పనిచేయడం లేదని, అధికారులు నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఖిల్లా వాటర్ ఫిల్టర్ బెడ్ కూడా చాలా దారుణమైన పరిస్థితిలో ఉందన్నారు. ప్రజల జీవితాలతో ఇరిగేషన్ అధికారులు ఆడుకుంటున్నారన్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిదర్శమని మండిపడ్డారు. వెంటనే మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్లో మాట్లాడి వారం రోజుల్లో దీనిపై నివేదిక ఇవ్వాలని, యంత్రాలన్నీ పని చేసేవిధంగా చర్యలు తీసుకొని, స్వచ్ఛమైన తాగు నీటిని నగర ప్రజలకు అందించాలని ఆదేశించారు. అనంతరం ఉద్యోగుల హాజరును పరిశీలించారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు


నడిపల్లి సీఎస్ఐ చర్చిలో యేసు క్రీస్తు సందేశాన్ని వినిపిస్తున్న పాస్టర్


ధర్మారం(బి)లో శిలువ మోస్తున్న క్రైస్తవ సభ్యుడు

డిచ్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని సీఎస్ఐ నడిపల్లి ఫాస్టరేట్, బర్ధిపూర్ సీఎస్ఐ చర్చితో పాటు జిల్లాలో ప్రసిద్ధి పొందిన ధర్మారం(బి) లూర్దు మాత చర్చి, సీఎంసీ విక్టోరియా చర్చి తదితర చర్చిలలో గుడ్‌ఫ్రైడే వేడుకలను జరుపుకున్నారు. కొందరు క్రైస్తవులు శిలువను మోశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్లు మాట్లాడుతూ.. యేసు క్రీస్తు పాపుల కోసం ప్రాణత్యాగం చేసి శిలువపై వేలాడారని తెలిపారు. యేసు క్రీస్తు సందేశాన్ని విన్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రూరల్ పరిధిలోని పలు గ్రామాల్లో..

నిజామాబాద్ రూరల్: మండలంలోని పలు చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యేసు క్రీస్తు వ్యాక్యాలు చదువుతూ, చర్చిల్లో పాటలు పాడుతూ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు, యువకులు నూతన దుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆయా గ్రామాల్లో చర్చిల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో క్రైస్తవులు, సంఘ కాపరులు, రెవరెండ్స్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జర్నలిస్టు రాంకోటి వెంకట్‌కు ఆర్థిక సాయం



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం అప్పుల పాలైన జర్నలిస్ట్ రాంకోటి వెంకట్‌కు ఆర్థిక సహకారం అందించడంతో పాటు చికిత్స నిమిత్తం చేయూతనిస్తామని నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ముందుకు వచ్చారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కమిటీ శుక్రవారం బాజిరెడ్డి గోవర్ధన్‌ను, ధన్‌పాల్ సూర్యనారాయణను, ఎంపీ ధర్మపురి అర్వింద్‌లను కలిసి వెంకట్ పరిస్థితిని విన్నవించి ఆదుకోవాలని కోరారు. స్పందించిన బాజిరెడ్డి గోవర్ధన్ రూ.లక్ష, ధన్‌పాల్ సూర్యనారాయణ రూ.50 వేలు ఇచ్చేందుకు అంగీకరించడంతో వారికి జిల్లా యూనియన్ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. నిజామాబాద్ ఎంపీ, ప్రస్తుత బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌కుమార్‌లు సైతం వెంకట్‌కు ఆర్థిక సహకారం అందించాలని జిల్లా కమిటీ తరపున కలిసి విన్నవించారు. ఒకటి, రెండు రోజుల్లో ఏదో ఒక రూపంలో సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంజీవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.అరవింద్ బాలాజీ, జిల్లా కోశాధికారి సిరిగాద ప్రసాద్, తదితరులున్నారు.

ఆర్మూర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఆర్మూర్: ఆర్మూర్ పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరు వినయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు సీఎంను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం స్పందించి మున్సిపల్‌కు నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్ను, కౌన్సిలర్లు ఇట్టడి నర్సారెడ్డి, ఆకుల రాము, ఇంతియాజ్, బి రమేశ్, నాయకులు పండిత్ పవన్, సంజయ్‌సింగ్ బబ్లూ, రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీది దోపిడీ రాజ్యం



భీమ్‌గల్: కాంగ్రెస్ పార్టీది దోపిడీ రాజ్యమని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో శుక్రవారం రైతు పోరుబాట కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే పైరవీ అని రాష్ట్రంలో ఆ పార్టీ నాయకులు అందరినీ బెదిరించి కమీషన్ వసూలు చేస్తున్నారని, నియోజకవర్గ నేతలు ప్రభుత్వ కార్యాలయాలను పంచుకొని పైరవీలు చేస్తున్నారని ఆరోపించారు. వరికి రూ.500 బోనస్ ఇచ్చి, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 490, నియోజకవర్గంలో 100కు పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం భీమ్‌గల్ తో పాటు చుట్టు పక్కల గ్రామాల రైతులు ఇప్పటికే దళారులకు ధాన్యాన్ని అమ్మేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర మాటలు మాని ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కొందరు తమ పార్టీ వీడినంత మాత్రాన బీఆర్ఎస్‌కు వచ్చిన నష్టమేమీ లేదని నికార్సయిన కార్యకర్తలు నాతో, కేసీఆర్‌తో ఉంటారని అన్నారు. ఉన్న వాళ్లమే కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి హామీలను అమలు చేయిస్తామన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

నేడు ఎంపీపీపై అవిశ్వాసం

మాక్లూర్: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మాస్తప్రభాకర్, వైస్‌ఎంపీపీ సుక్కి సుజాతపై శనివారం ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మానం ఉందని ఎంపీడీవో జె క్రాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్డీవో రాజేంద్రకుమార్ నేతృత్వంలో అవిశ్వాసం ఉటుందని అన్నారు. సభ్యులు సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

సాలూర సొసైటీ మహాజన సభ

బోధన్: సాలూర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభను చైర్మన్ అల్లె జనార్దన్ అధ్యక్షతన శనివారం ఉదయం సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈవో బస్వంత్‌రావు పటేల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం డైరెక్టర్లు, సభ్యులు, రైతులు సకాలంలో సభకు హాజరు కావాలని కోరారు.

కనీస వేతనం చెల్లించాలి

- మరణించిన ఆశావర్కర్ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- జిల్లా ఉప వైద్యాధికారి విద్యకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

నిజామాబాద్‌నాగారం: ఎడపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశ వర్కర్‌గా పని చేస్తున్న అబ్బవ్వ ఇటీవల ఆస్పత్రి పని నిమిత్తం బయటకు వెళ్లగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. మరణించిన ఆశా వర్కర్ కుటుంబానికి న్యాయం చేయాలని, ఆమె కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయు జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు నిజామాబాద్ ఉప వైద్యాధికారి విద్యకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని మెడికల్ కాలేజ్ వద్ద వినతిపత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జమ్మిశెట్టి శంకర్ గౌడ్ మాట్లాడుతూ..ఆశ వర్కర్లందరికి పర్మినెంట్ చేయాలని, ఆశా వర్కర్లకు కనీసం నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలన్నారు. మోపాల్‌కు చెందిన మరో ఆశ వర్కర్ విధులు నిర్వహిస్తూ అనారోగ్యానికి గురై శుక్రవారం మరణించారని, వారి కుటుంబాన్ని కూడా ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలన్నీ పరిష్కారం చేయాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆశా వర్కర్ల సంఘం జిల్లా నాయకులు గైని రాజమణి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు యేషాల గంగాధర్, సీఐటీయూ జిల్లా నాయకులు జంగం గంగాధర్, కటారి రాములు, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం(సొసైటీ) ఆధ్వర్యంలో ఏప్రిల్ 1 నుంచి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తామని చైర్మన్ రాంచందర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం డిచ్‌పల్లి సొసైటీ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకంగా సూపర్‌వైజర్‌ను నియమిస్తామన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల వద్ద టెంట్లు, తాగు నీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఒకే విడతలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని, రైతుబీమా, రుణ సదుపాయం కల్పించాలని తీర్మానించారు. సమావేశంలో సూపర్‌వైజర్ మోహన్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, ఖిల్లా రామాలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గురుకుల విద్యార్థినులు


ఎంపికైన క్రీడాకారిణులతో ప్రిన్సిపాల్ గోదావరి


సంహితతో జిల్లా కో–ఆర్డినేటర్ సంగీత

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు డిచ్‌పల్లి మండలం ధర్మారం(బి), సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలల విద్యార్థినులు ఎంపికయ్యారు. సుద్దపల్లి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు లిఖిత, గంగోత్రి, నిషిత, ధర్మారం(బి) గురుకుల పాఠశాల/కళాశాల విద్యార్థిని సంహితలు సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ బి.సంగీత, సుద్దపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ గోదావరి తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరుగనున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటారని వారు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా కో–ఆర్డినేటర్ సంగీత, ప్రిన్సిపాల్ గోదావరి, సీనియర్ వైస్ ప్రిన్సిపాల్ దీప్తివాణి, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ వనిత, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ నీరజారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ నల్లూరి లత, పీఈటీ జోత్స్న, సాఫ్ట్‌బాల్ అకాడమీ కోచ్ వేముల మౌనిక తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి

- ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య



తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతో పాటు పోరాటతత్వాన్ని అలవర్చుకోవాలని, ప్రశ్నించే తత్వం ఉంటేనే పరిష్కారం దొరుకుతుందని తెలంగాణ యూనివర్సిటీ పూర్వ విద్యార్థి, ఆర్మూర్ ఎంపీపీ పస్క నర్సయ్య పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ 53వ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకుని తెయూ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఓటమి విజయానికి మెట్టుగా భావించి మరింత శ్రమకోర్చి గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం జరిగిన ఖో–ఖో పోటీల్లో వివిధ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు హోరాహోరీగా తలపడ్డారు. కార్యక్రమంలో వర్సిటీ ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, సాగర్ నాయక్, ఉపాధ్యక్షులు మహేష్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

ఐపీఎల్ మ్యాచ్‌లను వీక్షించేందుకు స్క్రీన్ల ఏర్పాటు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఉమెన్స్ కళాశాల మైదానంలో 30, 31 తేదీలో భారీ స్క్రీన్ ద్వారా ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను వీక్షించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఐపీఎల్ ఫ్యాన్ పార్క్ నిర్వాహకులు వెంకట్రాంరెడ్డి, సత్యపాల్ తెలిపారు. శుక్రవారం నగరంలో ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ...క్రికెట్ ప్రేమికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	69,000	వెండి (కిలో)	79,000
22 క్యారెట్స్	63,640	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	35	60	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
బీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.45, 1.40, 4.35, 7.30, 10.25
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు) - 10.45, 1.50, 4.25, 10.25, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 7.30
స్క్రీన్-3	ది గోట్ లైఫ్ (తెలుగు) - 1.15, 7.25, 10.40, కలియుగం పట్టణంలో (తెలుగు) - 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.10, 1.10, 7.50, 10.50, ది గోట్ లైఫ్ (తెలుగు) - 4.10
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 12.00, 2.40, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-ఇంగ్లీష్) - 5.20, 8.00, 10.40
స్క్రీన్-3	ది గోట్ లైఫ్ (తెలుగు) - 12.05, 7.00, రజాకార్ (తెలుగు) - 3.45, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 10.40
స్క్రీన్-4	క్రూ (తెలుగు) - 10.45, 1.35, 7.40, 10.30, ప్రేమలు (తెలుగు) - 4.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు)
లలితామహల్	ఓం భీమ్ బుష్ (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)

బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడికి సన్మానం


సన్మానిస్తున్న చైర్మన్ పాలాస సత్యనారాయణ

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్‌ను వినాయక్‌నగర్ తుల్జాభవానీ ఆలయ కమిటీ చైర్మన్ పాలాస సత్యనారాయణ సన్మానించారు. ఇటీవల జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఎన్నికలు జరుగగా జగన్ మోహన్ గౌడ్ అధ్యక్షుడిగా గెలుపొందారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ శాలువా కప్పి సన్మానించారు. రాజ్‌కుమార్ సుబేదార్, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

సమాచారం..

అవిశ్వాస తీర్మాన ప్రత్యేక సమావేశం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె శ్రీనివాస్ అలియాస్ భూమయ్యపై శనివారం(30న) మధ్యాహ్నం 3 గంటలకు నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మానం ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీందర్ శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని 17 మంది ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు. అలాగే శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. 2019లో జరిగిన ఎన్నికల్లో 17 మంది ఎంపీటీసీలకు గానూ 11 మంది బీఆర్ఎస్ పార్టీ, ముగ్గురు కాంగ్రెస్ పార్టీ, ఒకరు బీజేపీ, ఇద్దరు స్వతంత్ర్య అభ్యర్థులు విజయం సాధించారు. ఇటీవల రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో ఏడుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీపీపై అవిశ్వాసం కోసం 9 మంది మెజార్టీ సరిపోతుంది. అయితే ప్రస్తుతం 13 మంది ఎంపీటీసీలు అవిశ్వాసానికి మద్దతు తెలుపుతున్నారు. ముల్లంగి(ఐ)కి చెందిన నడిపల్లి-2 ఎంపీటీసీ చిన్నోల్ల నర్సయ్యను ఎంపీపీగా చేయడానికి కాంగ్రెస్ ఎంపీటీసీలతో పాటు నలుగురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు మద్దతు తెలుపుతున్నారు.

నేటి నుంచి ఉత్తర తిరుపతిలో బ్రహ్మోత్సవాలు

నిజామాబాద్ సిటీ: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఇందూరు (గంగాస్థాన్ ఫేజ్-2) శ్రీవారి ఆలయం ఉత్తర తిరుపతి క్షేత్రంలో నేటి నుంచి బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి. వచ్చేనెల ఏప్రిల్ 4 వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ ఐదు రోజులపాటు వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.


గంగా జలాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

గ్రామ దేవతలకు జలాభిషేకం

సిరికొండ: చిన్నవాల్గోట్ గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామ దేవతలకు శుక్రవారం జలాభిషేకం నిర్వహించారు. డప్పు వాయిద్యాల మధ్య గంగా జలాలను గ్రామంలో ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవార్లకు అభిషేకం చేశారు. వీడీసీ చైర్మన్ బడాల రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.